క్లుప్తంగా

పరామర్శ



మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాజమోహన్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి మాజీ సర్పంచ్ జాఫర్ సాహెబ్ కుమార్తె షేక్ గాజుల షహనా (46) అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో శుక్రవారం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జడ్జి బి.రాజేష్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాజేష్

ఆత్మకూరు: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి.రాజేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో శుక్రవారం సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుంటే ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. అయితే ముందుగా చట్టంపై అవగాహన కలిగి ఉంటేనే అన్యాయంపై ప్రశ్నించగలుగుతామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను పూర్తి చేసి ఉన్నత పదవులు అలంకరించాలని, నీతి, నిజాయితీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సౌజన్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ-1 మస్తాన్‌వలి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ-1 షేక్.మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌బీ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతుల విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఏప్రిల్‌లో జరిగే ఎస్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

జొన్నల పరిశీలన



జొన్నలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

చేజర్ల: మండలంలోని చిత్తలూరు గ్రామంలో రైతులు పండించిన జొన్నలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బయట మార్కెట్‌లో ఒక క్వింటాల్ జొన్నలను రూ.2,400లకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. తేమశాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలు ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా రూ.3,180లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యానికి కూడా ప్రస్తుతం ధర బాగుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీరావు, ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ మాధురి పాల్గొన్నారు.

సంగంలో ముమ్మర ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సంగం: రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సంగంలో శుక్రవారం స్థానిక నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. మసీదు సెంటర్ నుంచి బ్రహ్మంగారి గుడి సెంటర్ వరకు ప్రతి గడపకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు



వాశిలి వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కిషోర్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో వరి సాగు చేసిన రైతులు ఇప్పటికే ముమ్మరంగా వరి కోతలు సాగిస్తుండగా ఆ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు కల్లాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 20 వేల ఎకరాలకుపైగా వరి సాగు చేపట్టగా, వివిధ దశల్లో వరి నాట్లు వేసిన రైతులు గత ఫిబ్రవరి నెల నుంచే వరి కోతలు మొదలుపెట్టారు. ప్రభుత్వం సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,183, 75 కేజీలకు రూ.1,637, గ్రేడ్-ఎ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, 75 కేజీల బస్తాకు రూ.1,652 మద్దతు ధర ప్రకటించగా, ప్రైవేట్ వ్యాపారులు, దళారులు పుట్టి కేఎస్ఎం-1638 రకం ధాన్యానికి రూ.22,500, ఆర్ఎన్ఆర్-15048 రకం ధాన్యానికి రూ.23,500 చొప్పున రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో దళారులు పుట్టి కేఎస్ఎం-1638 రకం ధాన్యానికి రూ.19,500, ఆర్ఎన్ఆర్-15048 రకం ధాన్యానికి రూ.21,500 చొప్పున చెల్లిస్తూ నేరుగా రైతుల వద్ద నుంచే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కల్పించిన కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధరకే దళారులు రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో రైతులు కూడా తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించడానికి మొగ్గుచూపుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ధాన్యం తరలింపు, గోనె సంచులను ప్రభుత్వమే ఉచితంగా రైతులకు అందిస్తోంది. ధాన్యం లోడ్ చేయడం నుంచి రైస్ మిల్లులకు రవాణా చేయడం వరకు ప్రభుత్వమే భరిస్తోంది.

సద్వినియోగం చేసుకోండి

వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం సమకూర్చిన సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ అధికారి కిషోర్ సూచించారు. మండలంలోని వాశిలిలో రైతుల ధాన్యం కల్లాలను శుక్రవారం ఆయన పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా అధిక ధరకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, ఈ క్రమంలో అవసరం ఉన్న రైతులు వ్యవసాయశాఖ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించండి



మాట్లాడుతున్న ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

వరికుంటపాడు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియమించిన సిబ్బంది నిష్పక్షపాతంగా, నిర్భయంగా విధులు నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక స్త్రీశక్తి భవనంలో బీఎల్వోలు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బీఎల్వోలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, తాను స్వయంగా ఫోన్ చేసినా లిఫ్ట్ చేసే పరిస్థితిలో బీఎల్వోలు లేరని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రెన్యుమరేషన్ పొందేవారు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురిపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని, బీఎల్వోలు సెక్టార్ అధికారులకు సహకరించాలని తెలిపారు. సమావేశంలో తాహసీల్దార్ అరుణాదేవి, ఎంపీడీఓ వెంకట కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని ఆర్డీఓ కె మధులత అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎంజీఆర్ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ, ఆర్ఓ మధులత మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రారంభం మొదలు, బ్యాలెట్ బ్యాక్సులు భద్రపరిచే వరకు సంబంధిత ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయరూ..



కృష్ణమందిరం ఎదురుగా ఉన్న శిలాఫలకం

ఆత్మకూరు: ఎన్నికల కోడ్ వచ్చి వారం రోజులు కావస్తోంది. కాగా ఆత్మకూరు పట్టణంలోని పలుచోట్ల ఉన్న నేతల విగ్రహాలు, శిలాఫలకాలను కప్పివేసిన అధికారులు.. హిల్‌రోడ్డు కృష్ణమందిరం ఎదురుగా గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కప్పివేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ శిలాఫలకాన్ని చూసి స్థానికులు ఎన్నికల కోడ్ అమలవుతోందా, లేదా అని ప్రశ్నిస్తున్నారు. విగ్రహాలను పట్టలతో కప్పివేసిన అధికారులు శిలాఫలకాలను కప్పివేయడం మరిచిపోయారా అని వ్యాఖ్యానిస్తున్నారు.

జలాశయాన్ని పరిశీలించిన ట్రెయినీ కలెక్టర్



వివరాలను తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయాన్ని ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహ ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిని ఎప్పుడు నిర్మించారు?, నీరు ఎక్కడి నుంచి వస్తుంది?, ఆయకట్టు పరిధి ఎంత? తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలాశయ గేట్లు పరిశీలించారు. అలాగే ఉదయగిరి ఆనకట్ట, పెద్దచెరువును చూశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, ఏఈలు సురేష్, వేణు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

- కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉన్న ఆస్తి పన్ను బకాయిలను ఈ నెలాఖరులోగా ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా ఉంటుందన్నారు. నగర ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు సమన్వయంతో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. మొండిబకాయిదారులకు నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు.

మైనార్టీలకు అండగా సీఎం జగన్

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి కాకాణి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ముత్తుకూరులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. వారితో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, ఆయన తనయుడు జగన్ రాజ్యాధికారం వైపు నడిపించారన్నారు. ముస్లింల కోరిక మేరకు ముత్తుకూరులో ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అబ్దుల్ రహీం, షేక్ నవీద్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ బీద మస్తాన్‌రావు



అల్లూరు: రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం మండలంలోని ఇస్కపల్లి ఇస్లాం కాలనీ, కుర్రులబ్బిపాళెంలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.

నేడు తూర్పుయర్రబల్లిలో విజయసంకల్పయాత్ర

కొండాపురం: మండలంలోని తూర్పుయర్రబల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయసంకల్పయాత్ర నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ చిమిలి రవీంద్ర శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయగిరిలో క్షయవ్యాధి నిర్మూలనపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వారు వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని గండిపాళెం వైద్యాధికారిణి ఎం.శివకల్పన సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివకుమారి, సూపర్‌వైజర్లు చెన్నయ్య, అంకమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్లదొనలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

కలిగిరి: మండలంలోని పడమరగుడ్లదొన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సురక్ష కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 503 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు(టౌన్): నెల్లూరు రూరల్ పరిధిలోని కొండ్లపూడిలో డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే వాసన్ ఐ కేర్ వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఉమామహేశ్వరి, దివ్య, ప్రియాంక, నారాయణరెడ్డి, పీఆర్వో జోజి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో మత్స్యకారుల చేరిక



మాట్లాడుతున్న కొండూరు అనిల్‌బాబు, పక్కన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి రూరల్ మండలం రాముడుపాళెం, బోగోలు మండలం బంగారుపాళెం గ్రామాల్లో టీడీపీకి చెందిన మత్స్యకారులు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కావలిలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆప్కాఫ్ రాష్ట్ర చైర్మన్ కొండూరు అనిల్‌బాబు మాట్లాడుతూ అందరినీ సోదరభావంతో చూసే ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంచితనం ఎలా ఉంటుందో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అహంకారం చూస్తే అర్థమవుతుందన్నారు. కావ్య కృష్ణారెడ్డికి ప్రజలు ఓటు రూపంలో సరైన బుద్ధి చెబుతారన్నారు. కావ్య కృష్ణారెడ్డి వాడుతున్న భాషను, సమాజంలో అన్నివర్గాలను హెచ్చరిస్తున్న ధోరణిని గమనిస్తే కావలికి ఓ రాక్షసుడు వలస వచ్చాడా అనిపిస్తోందని అన్నారు. నేరస్తులను వెంట పెట్టుకొని ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకోవాలనే దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్న కావ్య కృష్ణారెడ్డిది కూడా క్రిమినల్ బుద్ధేనన్నారు. ప్రశాంతమైన వాతావరణం ఉండే కావలిలో టీడీపీకి ఓటు వేయకుంటే ఇళ్లకు వచ్చి కొడుతామని హెచ్చరిస్తున్నారంటే కావ్య కృష్ణారెడ్డి అత్యంత ప్రమాదకరమైన క్రిమినల్ సంస్కృతిని కావలికి తీసుకొచ్చాడని అర్థమవుతోందన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండి రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో కావ్య కృష్ణారెడ్డి అహంకారానికి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

గరుడాద్రివాసునికి గరుడ వాహనసేవ



మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి

- కిటకిటలాడిన బిలకూట క్షేత్రం
- ఉదయం నుంచే పోటెత్తిన భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలక ఘట్టమైన గరుడ వాహనసేవను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవను భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందనే నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గరుడోత్సవంలో భాగంగా ఆలయ ప్రధానార్చకులు సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి తొలుత అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలు, గజమాలలు, సర్వాభరణాలతో సుందరంగా అలంకరించి గరుడవాహనంపై కొలువుదీర్చి మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సేవకే అంకితమై మనోవేగంతో సంచరించే గరుడినిపై ప్రసన్నుడు గ్రామోత్సవానికి బయలుదేరే దృశ్యం నేత్రపర్వంగా సాగింది. గరుడసేవలో స్వామివారిని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదనే విశ్వాసంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పోటెత్తిన భక్తులు

గరుడవాహన సేవకు భక్తులు భారీగా తరలిరావడంతో బిలకూట క్షేత్రం కిటకిటలాడింది. ఉదయం నిర్వహించిన మోహినీ ఉత్సవం నుంచే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. గరుడసేవకు ఊహించని స్థాయిలో భక్తులు తరలిరావడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. కొండ దిగువన కూడా వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు స్వల్ప ఇబ్బంది నెలకొంది.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మొక్కుబడులు, సాయంత్రం తెప్పోత్సవం, గజవాహనసేవ జరుగుతాయని ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా కావలి ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కనుమర్లపూడి వెంకటనారాయణ

కావలి: స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్టణంలోని చిరువ్యాపారులు, ఆర్యవైశ్యులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుమర్లపూడి వెంకటనారాయణ తెలిపారు. కావలిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందరితో కలివిడిగా ఉండే ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపేవారని తెలిపారు. పదవుల కేటాయింపుల్లోనూ ఆర్యవైశ్యులకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా వ్యాపారులంతా ఇబ్బంది పడుతుంటే, అధికారులతో చర్చించి వ్యాపారాలకు సమయం కేటాయించడంతోపాటు ఆర్థికంగా దెబ్బతిన్న చిరువ్యాపారుల కుటుంబాలకు ఎమ్మెల్యే చేసిన సాయం మరువలేనిదన్నారు. వ్యాపారులతో పాటు అన్నివర్గాల ప్రజలకు ఆయన అండగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మరోసారి అత్యధిక మెజారిటీతో కావలి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నియోజకవర్గ ఓటర్లంతా ఆయనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

పోషణ పక్వాడ్‌పై అవగాహన



వరికుంటపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీఓ లావణ్య

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లె మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి ఆధ్వర్యంలో సీడీపీఓ పచ్చవ లావణ్య అధ్యక్షతన పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అలేఖ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, జ్యోతి, జీవమ్మ, కవిత, అనసూర్యదేవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బిట్రగుంట: గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం పొందగలరని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సుభాషిణి పేర్కొన్నారు. బోగోలు మండలం ఎస్వీపాళెం పంచాయతీలోని ఎస్టీకాలనీలో పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనతను అరికట్టేందుకు, గర్భస్థ శిశువు ఎదుగుదలకు పోషకాహారం కీలకమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వాతి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు శుక్రవారం తెలిపారు. చండీ హోమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.